విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387


E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

PUBLISHED: HYDERABAD, JANGAON   సంపుటి :01   సంచిక :65   బుధవారం 05 ఆగస్టు 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-

## ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల


2 లో

2024 ముందు, తర్వాత పరిస్థితులపై వివరణ

ప్రజలకు సమగ్ర సమాచారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత

గత పాలనపై తీవ్ర విమర్శలు చేసిన సీఎం

భోగాపురం విమానాశ్రయం అభివృద్ధికి నిదర్శనమన్న వ్యాఖ్య

జీఎస్‌డీపీ వృద్ధిరేటుపై కీలక వివరాలు వెల్లడి

అంతర్జాతీయ గేట్‌వేగా ఏపీని తీర్చిదిద్దుతామన్న సీఎం

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై ఫోకస్

అభ్యర్థి ఎంపిక కసరత్తు

అభిప్రాయ సేకరణ ప్రారంభం

కాంగ్రెస్ వ్యూహరచన షురూ

సమర్థ అభ్యర్థి అన్వేషణ

ఓటరు నమోదుపై దృష్టి

పొన్నం కీలక ఆదేశాలు



2 లో

**న్యూస్ డెస్క్, 04 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణలో మరోసారి ఎన్నికల సంగ్రామం మొదలు కాబోతోంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండటంతో పార్టీలు ఈ ఎన్నికలపై దృష్టి సారించాయి. ఈ రెండు స్థానాలపై ఫోకస్ పెట్టిన అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అవసరమైన వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా అభిప్రాయ సేకరణ ప్రక్రియ ప్రారంభించారు.

**సమర్థవంతమైన అభ్యర్థికోసం వేట:**

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పట్టభద్రుల నియోజకవర్గం ఉంది. దీంతో ఇక్కడి నుంచి సమర్థవంతమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు పార్టీ పరంగా పొన్నం అభిప్రాయాలు సేకరిస్తున్నారు. అభ్యర్థి ఎంపికకు సంబంధించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకుల నుంచి లిఖితపూర్వకంగా అభిప్రాయాలను మంత్రి పొన్నం కార్యాలయం చేపట్టింది.

## హైడ్రాపై ఈటల ఫైర్.. ప్రజలను వేధించే సంస్థ

ప్రజలను వేధించే సంస్థగా హైడ్రా మారిందన్న ఈటల

ఇళ్ల కూల్చివేతలకు ప్రభుత్వానికి అధికారం లేదన్న వ్యాఖ్య

హిట్లర్‌తో పోలుస్తూ రేవంత్‌పై విమర్శలు 2 లో

పేదల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారన్న ఆరోపణ

భూముల కోసం హైడ్రాను వాడుతున్నారన్న విమర్శ

హైడ్రా తీరు ప్రజల్లో భయాందోళనలు పెంచిందన్న ఈటల

కోర్టుల మాట కూడా పట్టించుకోవడం లేదంటూ ఆరోపణ

## చదువు లేనోడివి నీకు విద్యాశాఖ ఎందుకు?

నామినేషన్‌పై ఓపెన్ చాలెంజ్

ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రస్తావన

హామీలు నెరవేర్చాలన్న అర్వింద్

పాలనపై బీజేపీ విమర్శలు

సీఎంపై ఘాటు వ్యాఖ్యలు



2 లో

**న్యూస్ డెస్క్, 04 ఆగస్టు (తెలుగు గళం):** ఇతరుల సహాయం లేకుండా ఎన్నికల నామినేషన్ పత్రం నింపలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ విద్యార్థుల గురించి మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. రెండో వ్యక్తి సహాయం లేకుండా నామినేషన్ పత్రం నింపగలవా అని సీఎంకు అర్వింద్ ఓపెన్ చాలెంజ్ విసిరారు.

## డీఎస్సీ పిల్‌పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

సీబీఐ దర్యాప్తుపై జోక్యానికి నిరాకరణ

బాధిత అభ్యర్థులే కోర్టుకు రావాలని సూచన

335 పిటిషన్లు ఇప్పటికే దాఖలైనట్లు గుర్తింపు

పిల్‌ను రాజకీయాలకు వాడొద్దని స్పష్టం

పిటిషనర్‌ను స్పష్టత ఇవ్వాలని ఆదేశం 2 లో

## ప్రజారోగ్యంతో చెలగాటం.. కల్తీ ముఠా అరెస్ట్

5 టన్నుల నకిలీ మసాలాలు, 89 టన్నుల నిల్వల స్వాధీనం

ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కెమికల్స్‌తో కల్తీ తయారీ

13 సంస్థలపై హెచ్-ఫాస్ట్ సోదాలు

బ్రాండెడ్ పేర్లతో మార్కెట్లో విక్రయించిన ముఠా

కాలేయం, కిడ్నీలు, క్యాన్సర్ ముప్పుపై సీపీ హెచ్చరిక

140 రోజుల్లో 246 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం 2 లో

## చండీపురా వైరస్ కలకలం


2 లో

22 మంది చిన్నారులు మృతి.. 35 కేసులు నమోదు

ఐసీయూలో ఏడుగురికి చికిత్స కొనసాగింపు

గ్రామాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ

15 ఏళ్లలోపు చిన్నారులకే అధిక ప్రమాదం

## 18 ఏళ్లకే కాలేజీ ప్రొఫెసర్


2 లో

19 ఏళ్ల రికార్డును 18 ఏళ్లకే అధిగమించిన నాథన్

10 ఏళ్ల నుంచే కాలేజీ విద్య ప్రారంభం

14 ఏళ్లకే ఇంజినీరింగ్ డిగ్రీ, మాస్టర్స్ పూర్తి

తాను చదివిన కాలేజీలోనే ప్రొఫెసర్‌గా నియామకం

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కిన ఘనత

ప్రస్తుతం లా డిగ్రీ చదువుతున్న యువ ప్రతిభ



## మూసీపై ప్రభుత్వం ఫుల్ ఫోకస్

**న్యూస్ డెస్క్, 04 ఆగస్టు (తెలుగు గళం):** సీఎం మానసపుత్రిక మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుపై సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. మొదటి దశ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెల 15వ తేదీ తర్వాత ఎప్పుడైనా ఏషియన్ డెవలప్‌మెంట్ (ఏడీబీ) నుంచి ఎప్పుడైనా లోన్ క్లియరెన్స్ వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. క్లియరెన్స్ వచ్చిన వెంటనే టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ టెండర్ ప్రకియ అంతా ఏడీబీ నిబంధనల ప్రకారమే చేయాల్సి ఉంటుంది. అన్ని ప్రక్రియలు పూర్తిచేసుకుని దసరా పండుగ రోజున మూసీ పునరుజ్జీవనం పనులకు శంకుస్థాపన చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

ఏడీబీ నిబంధనల ప్రకారమే..

మూసీ పునరుజ్జీవనం మొదటి దశకు రూ.4,500 కోట్ల రుణం ఇవ్వడానికి ఏడీబీ అంగీకరించిన విషయం తెలిసిందే. మొదటి దశ డీపీఆర్‌ను పరిశీలించడంతోపాటు సందేహాలు, అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి పలుమార్లు ఏడీబీ ప్రతినిధులు హైదరాబాద్‌కు వచ్చారు.

మిగతాది 2 లో..

మూసీ మేకోవర్‌కు ముహూర్తం

ఏడీబీ ఓకే.. పనులు స్టార్ట్

దసరాకే తొలి అడుగు

గ్రీన్ సిగ్నల్ కోసం కౌంట్‌డౌన్

గ్లోబల్ టెండర్లకు రంగం సిద్ధం

రూ.4,500 కోట్లతో కొత్త ఊపు

21 కి.మీ అభివృద్ధికి శ్రీకారం

80 రోజుల్లో ప్రాజెక్టు ట్రాక్‌పై

## పాక్‌లో ఉగ్రవాదుల వరుస హత్యలు

భారత్‌పై లష్కరే ఆరోపణలు

ఆరోపణలను ఖండించిన భారత్

పాక్‌లో వరుస హత్యలు

లష్కరే ఉనికి బహిర్గతం

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది వ్యాఖ్యలు


2 లో

**న్యూస్ డెస్క్, 04 ఆగస్టు (తెలుగు గళం):** పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థకు చెందిన ముష్కరులు అజ్ఞాతవాసుల చేతుల్లో హతం కావడం కలకలం రేపుతోంది. తమ సంస్థకు చెందిన 30 మందికి పైగ అపరిచిత వ్యక్తుల చేతుల్లో చనిపోయారి తాజాగా లష్కరే తొయిబాతో సంబంధమున్న సీనియర్ ఉగ్రవాది రిజ్వాన్ హనీఫ్గా చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

## హరీష్‌పై మహేష్ విమర్శలు

క్షుద్రపూజల ఆరోపణలు

ఆధారాలున్నాయని వ్యాఖ్యలు

హరీష్‌కు సవాల్ విసిరిన మహేష్

శివమొగ్గ పర్యటనపై ప్రశ్నలు

బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు

రాజకీయాల్లో మాటల యుద్ధం


2 లో

**న్యూస్ డెస్క్, 04 ఆగస్టు (తెలుగు గళం):** బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీష్ రావు స్వార్థం పరాకాష్టకు చేరిందని, ఆయన రోజురోజుకూ పశు పతిలా ప్రవర్తిస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయన క్షుద్రపూజలు చేస్తున్నారన్నది నిజమని, ఇందులో ఎలాంటి దాపరికం లేదన్నారు.

# పాక్‌లో ఉగ్రవాదుల వరుస హత్యలు

మొదటి పేజీ తరువాయి

రిజ్వాన్ హనీఫ్గా మాట్లాడుతున్నట్లుగా ఉన్న ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియోలో అతడు మాట్లాడుతూ.. గత మూడు నాలుగేళఅలలో పాస్థాన్ తో పాటు పీఓకే ప్రాంతాల్లో తమ సంస్థకు చెందిన 30 మందికి పైగా సభ్యులను అపరిచత వ్యక్తులు కాల్చి చంపారని చెప్పాడు.

హత్యల వెనుక భారత సంస్థలు..

ఈ హత్యల వెనుక భారత సంస్థలు ఉన్నాయని ఆ వీడియోలో రిజ్వాన్ ఆరోపించారు. పెషావర్, కరాచీ, రావల్పిండి, రావలాకోట్, ముజఫరాబాద్ వంటి ప్రాంతాల్లో ఈ హత్యలు జరిగాయని, గత కొంత కాలంగా తమ సంస్థ కార్యకర్తలను టార్గెట్ చేసుకుని ఈ వరుస హత్యలు జరుగుతున్న?్నయని అతడు ఆరోపించారు. 2008 ముంబై దాడుల (166 మంది మృతి) వెనుక ఉన్న లష్కరే తొయిబా సంస్థను ఐక్యరాజ్యసమితి 2005లోనే నిషేధించింది. అయితే ఆ సంస్థకు చెందిన ఒక ఉన్నత స్థాయి ఉగ్రవాది తమ సభ్యుల హత్యలను ఇలా బహిరంగంగా అంగీకరించడం ఇదే తొలిసారి. లష్కరే తొయిబా సంస్థను ఎప్పుడో నిషేధించి, రద్దు చేశామని పాకిస్థాన్ చెబుతున్నప్పటికీ, ఈ వీడియో ద్వారా అక్కడ వారి ఉనికి మరోసారి ప్రపంచానికి బయటపడింది.

ఖండించిన భారత్..

ఈ హత్యల వెనుక భారత ఏజెన్సీల హస్తం ఉందంటూ రిజ్వాన్ హనీఫ్ చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అంతేకాకుండా ఈ వీడియోలో రిజ్వాన్ హిందూ మతంపై అత్యంత అనుచితమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినట్లు తేలింది. ఉగ్రవాద సంస్థలు మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతూ, యువతను తీవ్రవాదం వైపు ఎలా పురికొల్పుతాయో ఈ ఘటన మరొకసారి స్పష్టం చేస్తోంది. వీడియోలోని రిజ్వాన్ హనీఫ్ భారత్‌కు కావలసిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులలో ఒకడని తెలిపారు.


# హరీష్‌పై మహేష్ విమర్శలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, పంటలు పండకూడదని కుట్రలు పన్నారని, ప్రజలు కరువుతో అల్లాడిపోవాలని కుతంత్రాలు చేశారన్నారు. సామా రామ్మోహన్, దయాకర్ కు నోటీసులు ఇవ్వడం కూడా అందులో ఒక భాగమని దుయ్యబట్టారు. హరీష్ రావు క్షుద్రపూజలు చేశాడనేందుకు ఉదాహరణలు కూడా ఉన్నాయన్నారు.

తమిళనాడులోని తిరుచిరాపల్లి, శివమొగ్గ ప్రాంతాల్లో క్షుద్రపూజలు చేసే దేవాలయాలున్నాయని, అక్కడికి హరీష్ రావు జూన్ 1, మే 31, జులై 23న వెళ్లారనేందుకు ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. అబద్ధమైతే తాము చెప్పిన తేదీల్లో హరీష్ రావు ఎక్కడున్నారో మీడియాకు చెప్పాలని డిమాండ్ చేశారు. హరీష్ సమాధానం చెప్తే.. తాను, సీఎం కూడా బీఆర్ఎస్ అడిగేవాటికి సమాధానం చెప్తామన్నారు. వాస్తవాలు మాట్లాడినందుకు తమ పార్టీ నేతలకు నోటీసులు ఇచ్చినంత ఈజీగా నిజాలు చెప్పలేరన్నారు. శివమొగ్గ వెళ్లిన హరీష్ రావు ఫొటోలను సోషల్ మీడియాలో ఎందుకు పోస్ట్ చేయలేదని ప్రశ్నించారు. తిరుపతి వెళ్తే మీడియాతో మాట్లాడే హరీష్ రావు.. శివమొగ్గలో మీడియాను ఎందుకు అవాయిడ్ చేశారని ప్రశ్నించారు. రాష్ట్రానికి మంచి జరగకూడదని క్షుద్రపూజలు చేయించడం ఎంతవరకూ సబబు ? బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి అఘోర, తాంత్రిక పూజలు చేయిస్తోందన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్ లో క్షుద్రపూజలు చేయిస్తున్నారంటే నమ్మలేదు కానీ.. ఇప్పుడు హరీష్ రావును చూస్తోంటే అనుమానాలు వస్తున్నాయన్నారు.

# ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల



**న్యూస్ డెస్క్, 04 ఆగష్టు (తెలుగు గళం):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ శ్వేతపత్రంలో 2024 ముందు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, తాజా పరిస్థితులను ప్రజలకు వివరించారు. రాష్ట్ర సమగ్ర సమాచారాన్ని ప్రజలకు తెలుపడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. గవర్నెన్స్ బాగుంటేనే దాని ఫలితాలు ప్రజా జీవితంలో ప్రస్ఫుటమవుతాయని తెలిపారు. ప్రజలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని చెప్పడం ఒక చారిత్రక అంశమన్నారు. అన్ని ఎన్నికల్లో టీడీపీదే ప్రభంజనమని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల సాధించిన విజయం ఊహించని విప్లవం వంటిదన్నారు. విప్లవం కోసం ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంస పాలనతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని, వైసీపీ పాలనపై వ్యతిరేకతతోనే 2024 ఎన్నికల్లో కూటమికి భారీ విజయం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ శ్వేతపత్రం విడుదల వెనుక ఎవరినో నిందించాలన్న ఉద్దేశం తమకు లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తుందనేందుకు భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవమే ఒక నిదర్శనమన్నారు. అది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదని.. ఉత్తరాంధ్ర కలల సౌధమని పునరుద్ఘాటించారు.

గత పాలకులు రాష్ట్రానికి ప్రాజెక్టులు రాకుండా చేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్ వేగా తయారు చేస్తోందన్నారు. రెండు రాష్ట్రాలను తానే అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. తెలంగాణలో తెలుగువారు ఆస్తులు అనుభవిస్తున్నారని, ఏపీలో మాత్రం నష్టం జరిగిందని ఆవేదన చెందారు. 2019లో తాము దిగిపోయేనాటికి గ్రోత్ రేట్ 13.5 శాతంగా ఉందని, 2019-24 మధ్య GSDP 3.18శాతం తగ్గిందన్నారు. 2019-24 మధ్య కూడా గ్రోత్ 13.5 శాతం ఉండి ఉంటే రూ.76 వేల కోట్ల ఆదాయం అదనంగా వచ్చి ఉండేదన్నారు.

# 18 ఏళ్లకే కాలేజీ ప్రొఫెసర్



**న్యూస్ డెస్క్, 04 ఆగష్టు (తెలుగు గళం):** సాధారణంగా 18 ఏళ్ల వయసులో యువత ఏం చేస్తుంటారు హ్యాపీగా కాలేజీ డేస్ లైఫ్ స్టార్ట్ చేస్తారు కదా. కానీ.. 18 ఏళ్ల నాథల్ అనే యువకుడు డిగ్రీ, మాస్టర్స్ కూడా పూర్తి చేసి.. కాలేజీ స్టూడెంట్స్ కి పాఠాలు చెప్పే ప్రొఫెసర్ వృత్తిలో చేరాడు. ప్రపంచంలోనే అతి చిన్న వయసులో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న వ్యక్తిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో నాథన్ థామస్ చోటు దక్కించుకున్నాడు. 306 ఏళ్లుగా ఉన్న రికార్డును అతను బ్రేక్ చేశాడు. ప్రస్తుతం నాథన్ వయసు 18 ఏళ్ల 346 రోజులు. అంతకుముందు ఈ రికార్డు స్కాట్లాండ్ కు చెందిన గణిత శాస్త్రవేత్త కొలిన్ మెక్ లారిన్ పేరిట ఉండేది. 1717లో 19 ఏళ్ల వయసులో ఆయన ప్రొఫెసర్ గా అపాయింట్ అయ్యారు.నాథన్ విషయానికొస్తే.. 10 ఏళ్ల వయసులోనే డ్యూయల్ ఎన్రోల్మెంట్ ద్వారా మయామి డేడ్ కాలేజీలో చేరాడు. స్కూల్ స్టడీస్ తో పాటే.. కాలేజీ విద్యనూ ప్రారంభించాడు. 14 ఏళ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో చేరి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లో డిగ్రీ, మాస్టర్స్ కంప్లీట్ చేశాడు. ఆపై తాను చదివిన మయామిడేడ్ కాలేజీలోని ప్రొఫెసర్ గా చేరాడు. 2023 ఆగస్టులో ఇంజినీరింగ్ స్టూడెంట్స్ కు సి ఫర్ ఇంజినీర్స్ కోర్సు చెప్పడం ప్రారంభించాడు. అయితే తన వయసుకు దగ్గరగా ఉన్న స్టూడెంట్స్ కు పాఠాలు చెప్పడం ఎప్పుడూ ఇబ్బందిగా అనిపించలేదని తెలిపాడు. ప్రస్తుతం అతను మయామి యూనివర్సిటీ లా స్కూల్లో జ్యూరిస్ డాక్టర్ డిగ్రీ కూడా చదువుతుండగా.. 2028లో స్టడీస్ కంప్లీట్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై ప్రభుత్వం ఫోకస్

మొదటి పేజీ తరువాయి

పార్టీ బలోపేతానికి, సమర్థవంతమైన అభ్యర్థి ఎంపికకు స్థానిక నాయకుల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తామని తెలిపారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి:

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ఇంచార్జిలు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు సమన్వయంతో విజయవంతం చేయాలని, ప్రతి నియోజకవర్గంలో లక్ష్యాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# చండీపురా వైరస్ కలకలం



**న్యూస్ డెస్క్, 04 ఆగష్టు (తెలుగు గళం):** గుజరాత్ రాష్ట్రంలో చండీపురా వైరస్ కలకలం రేగింది. వైరస్ బారినపడి 22 మంది చిన్నారు చినపోయారు. మరో ఏడుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 35 మందికి వైరస్ నిర్ధారించారు. వైరస్ పోయేందుకు గ్రామాల్లో క్రిమి సంహారక మందులను పిచికారి చేస్తున్నారు. ఇదిలా ఉంటే చండీపురా వైరస్ అనేది 15ఏళ్ల లోపు చిన్నారులపై ప్రభావం చూపించే ప్రమాదకరమైన వైరల్ ఇన్ఫెక్షన్. శాండ్ ఫ్లై అనే ఈగల ద్వారా, మురికి కాలువలో ఉండే దోమలు, నల్లులు లాంటి కీటకాల ద్వారా ఇది వ్యాపిస్తుంది.

ఒక మనిషి నుండి మరొకరికి నేరుగా వ్యాపించదు. ఈ వైరస్ కారణంగా చిన్నారులకు తీవ్రమైన మెదడువాపు వస్తుంది. వైరస్ సోకిన చిన్నారుల్లో లక్షణాలు వేగంగా పెరిగిపోతాయి. కొన్నిసార్లు 48 గంటల్లోనే పరిస్థితి విషమించే ప్రమాద ఉంటుంది. అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు, మూర్ఛ రావడం, మెదడు కణజాలల వాపు, కోమాలోకి వెళ్లడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇప్పటి వరకు దీనికి సరైన యాంటీవైరల్ మందులు అందుబాటులో లేవు. వైరస్ బారిన పడినవారిని ఐసీయూలో అత్యవసర చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయం నుండి బయటపడవచ్చు.

# హైడ్రాపై ఈటల ఫైర్.. ప్రజలను వేధించే సంస్థ



**న్యూస్ డెస్క్, 04 ఆగష్టు (తెలుగు గళం):** హైడ్రాపై మరోసారి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు కురిపించారు. హైడ్రా అనేది ప్రజలను వేధించే సంస్థ అని మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండొచ్చు కానీ ఇండ్లు కూలగొట్టే అధికారం లేదని అన్నారు. హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రా స్థాపించామని రేవంత్ రెడ్డి చెప్పాడని, హిట్లర్ ఎంతో విధ్వంసం సృష్టించారని అన్నారు. ప్రజలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని అన్నారు. ఇప్పుడు హిట్లర్ ప్రజలను వేధించినట్టే హైడ్రా ద్వారా రేవంత్ రెడ్డి ప్రజలను వేధిస్తున్నాడని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇండ్లు కూలగొట్టే సంస్థగా ప్రజలు నిర్ధారించారని వ్యాఖ్యానించారు.

నలభై, యాభై ఏళ్ల క్రితం తెలంగాణ నలుమూలల నుండి వచ్చి చెరువుల, కాలువల పక్కన కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చివేశారని అన్నారు. తమకు కావాల్సిన వారికి భూములు కట్టబెట్టేందుకు, తమకు వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను వాడుతున్నాడని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో హైడ్రాను చూసి భయపడి, ఇల్లు కొనేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారని ఈటల వ్యాఖ్యానించారు. హైడ్రా రెవెన్యూ, మున్సిపల్, హోం డిపార్ట్మెంట్ అన్ని డిపార్ట్మెంట్ల కంటే సుప్రీం డిపార్ట్మెంట్ గా వ్యవహరిస్తోందన్నారు. కోర్టుల మాట కూడా వినడంలేదని, చివరికి రేవంత్ రెడ్డి మాట కూడా హైడ్రా వింటుందో ఏదో అనే అనుమానం వస్తుందని అన్నారు.

# ప్రజారోగ్యంతో చెలగాటం.. కల్తీ ముఠా అరెస్ట్



**న్యూస్ డెస్క్, 04 ఆగష్టు (తెలుగు గళం):** హైదరాబాద్ కాటేదాన్ పరిధిలో హెచ్-ఫాస్ట్ అధికారులు మరోసారి విరుచుకుపడ్డారు. అత్యంత ప్రమాదకరమైన రీతిలో నకిలీ, కల్తీ మసాలా దినుసులను తయారు చేస్తున్న ముఠా గుట్టును రట్టు చేస్తూ భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఈ దాడుల్లో అధికారులు 25 టన్నుల నకిలీ మసాలా దినుసులతో పాటు, తయారీకి సిద్ధంగా ఉంచిన మరో 89 టన్నుల కల్తీ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిత్యం వాడే జీలకర్ర, లవంగాలు, షాజీరా, ఆవాలు, మెంతులు, సోంపు మరియు చిన్న ఆవాలను ఈ ముఠా రసాయనాలతో కల్తీ చేస్తోంది. ముఖ్యంగా బట్టలకు రంగులు అద్దేందుకు వాడే అత్యంత ప్రమాదకరమైన ఫ్యాబ్రిక్ డై లను ఈ మసాలాల తయారీకి ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లవంగాల నుంచి నూనె తీసేసిన తర్వాత మిగిలే నాసిరకం చెత్తను సేకరించి, దానికి హానికర కెమికల్స్ కలిపి ప్రాసెస్ చేస్తున్నారు. అనంతరం వాటిపై ప్రముఖ బ్రాండెడ్ ముద్రలు వేసి మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఈ కల్తీ ప్రాసెసింగ్ కోసం ఇండోర్ నుంచి ప్రత్యేకమైన యంత్రాలు, పరికరాలను తెప్పించి మరీ వ్యాపారం సాగిస్తున్నట్లు తేలింది. తక్కువ ధరలకే లభిస్తున్నాయనే ఆశతో స్థానిక మార్కెట్ల ద్వారా వీటిని విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఈ ముఠాపై అధికారులు తీవ్ర స్థాయిలో చర్యలకు ఉపక్రమించారు.ఈ దాడుల వివరాలను హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడిస్తూ, ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలాలకు రంగు, మెరుపు తీసుకురావడానికి ఇండస్ట్రియల్ ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్స్, కొన్ని చోట్ల ఏకంగా హెయిర్ కలర్ కూడా ఉపయోగిస్తున్నారని సీపీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి కెమికల్ కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలకు కాలేయం, మూత్రపిండాల సమస్యలతో పాటు క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని, ఆహార భద్రతా చట్టం కింద కల్తీదారులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు. హెచ్-ఫాస్ట్ రూపుదిద్దుకున్న 140 రోజుల్లోనే ఇప్పటివరకు 659 ప్రాంతాల్లో దాడులు జరిపి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ప్రజలు ఎక్కడైనా అనుమానాస్పద ఆహార పదార్థాలు లేదా కల్తీ తయారీ కేంద్రాలను గమనిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా సీపీ కోరారు.

# మూసీపై ప్రభుత్వం ఫుల్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టు చేపట్టే ఏరియాల్లోనూ పరిశీలించారు. ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతోనూ సమావేశమై చర్చించారు. చివరగా చిన్నచిన్న సందేహాలను పరిష్కరించడానికి గూగుల్ మీట్ ద్వారా రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. చివరగా ఈ నెల 15వ తేదీ తర్వాత ఎప్పుడైనా రూ.4,500 కోట్ల లోన్ ఇవ్వడానికి క్లియరెన్స్ ఇవ్వడంతోపాటు అధికారింగా లెటర్ జారీ చేయనున్నారు. దీంతోపాటు ఏడీబీ నిబంధనల ప్రకారమే టెండర్ ప్రక్రియను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో సాధారణంగా ఏ ప్రాజెక్టుకు సంబంధించిన ఈపీసీ టెండర్లు పిలవడానికి 21 రోజులపాటు గడువు ఇస్తారు. కానీ ఏడీబీ రూల్స్ ప్రకారం మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుకు 42 రోజులపాటు టెండర్ గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు గ్లోబల్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనుండడంతో ఏడీబీ సభ్యత్వం కల్గిన 68 దేశాలకు సంబంధించిన నిర్మాణ సంస్థలు సైతం టెండర్లలో పాల్గొనే విధంగా వెసులుబాటు కల్పించే అవకాశముంది. అయితే ఏడీబీ లోన్ ఇచ్చే ఏ ప్రాజెక్టు పనుల్లోనైనా ఈ నిబంధనలను పాటించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.



మొదటి దశ 21కి.మీ

హైదరాబాద్ మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా ఫేజ్ -1లో గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల మేరకు పూర్తి చేయడానికి రూ.7,345 కోట్లకు మంత్రి మండలి పరిపాలనా అనుమతులను మంజూరు చేయడంతోపాటు ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కి.మీ మార్గాల్లో భూసేకరణ తక్కువగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి భూసేకరణ, హిమాయత్ సాగర్ బండ్ బలోపేతం, ఎకో ప్రాజెక్టు పనులను చేపట్టనున్నారు. మొదటి దశ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియకు సంబంధించిన పేపర్ వర్క్ సైతం పూర్తిచేసినట్టు సమాచారం.

80 రోజుల్లో పట్టాలెక్కనున్న ప్రాజెక్టు

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు మొదటి దశ డీపీఆర్, భాగస్వామ్య శాఖల అధికారుల సమావేశంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఏడీబీ ప్రతినిధులు ఈ నెల 15 లోగా రూ.4,500 కోట్ల రుణానికి క్లియరెన్స్ ఇవ్వనున్నారు. మరో 42 రోజుల టెండర్ ప్రక్రియ పూర్తి, ఏజెన్సీ ఫైనల్ చేయడానికి మరో 15 రోజులు పట్టే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ రోజున పనులకు శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు సైతం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఈ ప్రాజెక్టును ప్రచారాస్త్రంగా వాడుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది.

# డీఎస్సీ పిల్‌పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు




**న్యూస్ డెస్క్, 04 ఆగష్టు (తెలుగు గళం):** మెగా డీఎస్సీ-2025 వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలంటూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై జోక్యం చేసుకునేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. ఈ మేరకు పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

బాధితులేరీ?..

స్పోర్ట్స్ కోటాతో నష్టపోయిన అభ్యర్థులు నేరుగా కోర్టుకు ఎందుకు రావడం లేదని ధర్మాసనం ప్రశ్నించింది. బాధితులు కోర్టుకు వచ్చేందుకు భయపడుతున్నారన్న పిటిషనర్ వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. డీఎస్సీ నోటిఫికేషన్, నియామకాలపై ఇప్పటికే ఏకంగా 335 పిటిషన్లు దాఖలైన విషయాన్ని గుర్తు చేసింది. అత్యంత విలువైన 'పిల్'ను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడానికి అనుమతిస్తే.. దాని అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని కోర్టు స్పష్టం చేసింది. చివరగా, ఈ పిల్ పై వాదనలు కొనసాగిస్తారా? లేక పిటిషన్‌ను ఉపసంహరించుకుంటారా? అనే విషయంపై పిటిషనర్‌ను అడిగి స్పష్టతతో తమ ముందుకు రావాలని ఆయన తరపు న్యాయవాదికి హైకోర్టు సూచించింది.

# చదువు లేనోడివి నీకు విద్యాశాఖ ఎందుకు?





**న్యూస్ డెస్క్, 04 ఆగష్టు (తెలుగు గళం):** ఇతరుల సహాయం లేకుండా ఎన్నికల నామినేషన్ పత్రం నింపలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ విద్యార్థుల గురించి మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. రెండో వ్యక్తి సహాయం లేకుండా నామినేషన్ పత్రం నింపగలవా అని సీఎంకు అర్వింద్ ఓపెన్ చాలెంజ్ విసిరారు. చదువు లేని రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖను పెట్టుకోవడానికి సిగ్గులేదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి తన వద్ద ఉన్న విద్యాశాఖను శ్రీధర్ బాబు లాంటి చదువుకున్న వారికి అప్పగించాలన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన, ఆయన ఇస్తున్న స్టేట్‌మెంట్లు అన్నీ తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేవిధంగా ఉన్నాయని దుయ్యబట్టారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన అర్వింద్.. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు ఇదే రకంగా చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీ మాటలతో ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా? : 65 శాతం క్లాసులు విని పరీక్షలు రాసి పాసైన ఇంజనీరింగ్ విద్యార్థులకు అప్లికేషన్ ఫామ్?లు నింపడం రాదని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే ఒక రాష్ట్రంలో అత్యధికంగా ఇంజినీరింగ్?లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అలాంటి విద్యార్థుల భవిష్యత్?ను రేవంత్ రెడ్డి ఏం చేయదలుచుకున్నారని ప్రశ్నించారు. సీఎం ఈ రకంగా మాట్లాడితే మన ఇంజనీరింగ్ పిల్లలకు ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా? ఇప్పుడు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ఏంటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు అదే కార్యక్రమంలో ఉన్న ఉపాధ్యాయులు చప్పట్లు కొట్టడం కూడా చాలా తప్పన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆడబిల్లలకు టాయిలెట్స్ లేని స్కూల్స్ ఉన్నాయన్నారు. ఉన్న స్కూల్స్ బాగు చేయకపోయినా కమిషన్ల కోసం కొత్త స్కూల్స్ కడుతామంటున్నారని మండిపడ్డారు. టీచర్ల పీఆర్సీ ఇవ్వని ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల బాగోగుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ ఇప్పటికీ ప్రతిపక్ష నేతగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

తమాషాలు చేస్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా? : గతంలో తాము ఎక్కడికైనా వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లేవారు వచ్చినట్లు మమ్మల్నీ చూస్తున్నారని ముఖ్యమంత్రి మాట్లాడారని అలా మాట్లాడితే ఎవరైనా పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారా అని నిలదీశారు. నువ్వేం ముఖ్యమంత్రివి? తమాషాలు చేస్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా? అని మండిపడ్డారు. చదివినోళ్లకు చదవనోళ్లకు ఫ్యూచర్ లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. మరో వైపు హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ పూర్తిగా నాశనం పట్టించారని ఓ వైపు కోర్టు చీవాట్లు పెడుతుంటే రేవంత్ రెడ్డి ప్రొటెక్ట్ చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు.

# వాడుకలో లేని ఖబరస్తాన్ భూమిపై గద్దల కన్ను

- అమ్మి సొమ్ము చేసుకోవడానికి అక్రమార్కుల పావులు.
- మున్సిపల్ రహదారి ఉన్నా మేము అనుమతి ఇప్పిస్తామంటూ భ్రమలు.
- కాసులకు కక్కుర్తి పడి కొంతమంది ముస్లింనేతల ఆసక్తి.
- వక్ఫ్ బోర్డ్ గెజిట్ లో నమోదయి ఉన్న ఖబరస్తాన్ కబ్జా కోసం తెరవ వెనుక ప్రయత్నాలు


THE ANDHRA PRADESH GAZETTE
PUBLISHED BY AUTHORITY
HYDERABAD, THURSDAY, JANUARY 25, 1990
NOTIFICATIONS BY HEADS OF DEPARTMENTS, ETC.
REVENUE NOTIFICATIONS
LIST OF WAKF PROPERTIES (REGISTERED AND UN-REGISTERED) IN KHAMMAM REGION SURVEYED UNDER SECTION 5(2) OF THE WAKF ACT, 1954





సత్తుపల్లి, ఆర్ సి, ఆగస్టు04 (తెలుగు గళం) న్యూస్: 1990 జనవరి 01 గెజిట్ నెంబర్-4-ఎ, సీరియల్ నెంబర్ -10555, సర్వే నెంబర్ -131లో గల వక్ఫ్ బోర్డు ద్వారా రిజిస్టర్ అయిన పాత సెంటర్లోని ముస్లింల పాతఖబరస్థాన్ (ఖననవాటిక)పైన అక్రమార్కుల కన్ను పడింది. అప్పట్లో ఒక దాత తన సొంత ఆస్తిలో0.20 కుంటలు(అలా ఎకరం భూమి)స్థలాన్ని ఖబరస్థాన్ కోసం మసీదుకు వక్ఫ్ బోర్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం అక్కడ 0.13 కుంటలు మాత్రమే ప్రహరీ గోడ కట్టి ఉన్నది, మిగిలిన ఏడు కుంటలు ఆక్రమణలో ఉంది. ఆ స్థలం కంకరనేల (మొరంనేల) కావడంతో చనిపోయిన వారిని ఖననం చేయడానికి తవ్వాలంటే ఇబ్బందిగా ఉందనే విషయం ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ జలగం వెంగళరావు దృష్టికి తీసుకుని వెళ్లడంతో ముస్లింలకు సత్తుపల్లి పట్టణంలో ప్రస్తుత జవహర్ నగర్ లో (అప్పట్లో జవహర్ నగర్ లేదు)మరో ఈద్గా తో పాటు ఖబరస్థాన్ కొరకు స్థలం కేటాయించడం జరిగింది. కొత్తగా కేటాయించిన ఖబరస్థాన్ (సర్వే నెంబర్ -173/1/పి, 1.16 ఎకరాలు (ఆక్రమణకు గురి కాగా మిగిలిన స్థలం)నేల మెత్తగా తవ్వడానికి అనుకూలంగా ఉండడంతో ముస్లింలు చనిపోతే కొత్త స్థలంలోనే ఖననం చేస్తూ వస్తున్నారు. పాత ఖబరస్థాన్ ను రంజాన్, బక్రీద్, మొహరం తదితర పర్వదినాల వేళల్లోమాత్రమే సందర్శించి తమ పూర్వీకుల కోసంప్రార్థనలు చేస్తూవస్తున్నారు. ప్రజలు నిత్యం రాకపోకలు లేకపోవడాన్ని గమనించి ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు ఆ స్థలాన్ని ఎలాగైనా అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకసారి ప్రజలకు దానం చేసిన ఆస్తి పైన ప్రజలకే పూర్తి హక్కు ఉంటుంది. ఒకసారి మున్సిపాలిటీకి గానీ పంచాయతీకి గానీ రోడ్డు కోసం స్థలం కేటాయించి ప్రభుత్వ రికార్డుల్లో నమోదైతే ఆ రోడ్డుపైన ప్రజలందరికీ హక్కు ఉంటుంది. సరిహద్దు గోడ వరకు మున్సిపాలిటీ రోడ్డు ఉంది ఆ రోడ్డుపైన రాకపోకలు చేసుకోవడానికి అందరికీ హక్కు ఉంటుంది. ఎవరైనా ప్రజల కోసం పని కావాలి అంటే చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీ లేదా మంత్రి దగ్గరకు వెళతారు కానీ ముస్లింల ఖబరస్థాన్ కు గేటు పెట్టుకోవడానికి నేను అనుమతి ఇప్పిస్తానంటూ పట్టణానికి చెందిన ఒక మోతెబరి చెప్పడం,గొర్రెల్లా అతని వద్దకు తీసుకుని వెళ్ళడం లోనే మతలబు ఏమిటి అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.దానికి మేము ఎంతో కృషి చేస్తున్నాం అంటూ కొందరు ముస్లింనేతలు ప్రజలను మభ్యపెట్టడం ఏమిటి? అని పట్టణంలో ప్రజలు చర్చించుకుంటున్నారు

### అసలు కథ ఇదే!

గత 50 ఏళ్ళ క్రితం ప్రజలకు దానం చేసిన భూమికి మేమే వారసులం అంటూ కొంతమంది అక్రమార్కులు మాన్యువల్ పహాణీలు(నకిలీ పహాణీలు) పట్టుకుని మేమే ఈ భూమికి యజమానులం వారసులం అంటూ ఆ భూమి అమ్మి సొమ్ము చేసుకోవడానికి తెరవెనుక ప్రయత్నాలు జరుపుతున్నారని గుసగుస లాడుకుంటున్నారు. ప్లాట్ కొనడానికి వచ్చే పార్టీలకు దారి కావాలి కనుక ఖబరస్థాన్ గోడ పడగొడితే దారి వస్తుంది అని అది ముస్లింలందరికీ ఉపయోగ పడుతుంది అని మభ్యపెడుతూ ఉన్నారు. దారి వాడుకోవడానికి ఆల్రెడీ మున్సిపల్ రికార్డుల్లో కేటాయించబడిన రోడ్డును వాడుకోవడానికి ఆంక్షలు లేకుండా చేస్తాం అంటూ మభ్యపెడుతున్నారు. దీనికి అక్రమార్కులు కొందరు ఒక ముఠాగా ఏర్పడి పావులుకదుపుతున్నారని సత్తుపల్లి పట్టణంలో చర్చ జరుగుతుంది. ఇప్పటికైనా మసీదు కమిటీ వారు నిజానిజాలు ప్రజల ముందు పెట్టి ఖబరస్థాన్ స్థలాన్ని కబ్జాదారుల పాలు కాకుండా కాపాడి పట్టణ మరియు నియోజకవర్గ ముస్లిం లకు ఉపయోగపడేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ముస్లింలు కోరుతున్నారు.

# దేవాదుల నీటితో పంటలను కాపాడాలి

## మంత్రి ఉత్తమ్‌ను కోరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 4

రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డిని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల ప్రస్తుత పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తొలకరి వానలను నమ్ముకుని, అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులు, బోరు బావుల కింద రైతులు ఆరుతడి పంటలతో పాటు వరి నార్లు పోశారని తెలిపారు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆరుతడి పంటలు ఎండిపోతుండగా, వరి నారు ముదిరిపోతోందని వివరించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని వెంటనే విడుదల చేసి, ఆరుతడి పంటలు మరియు వరి నారు మళ్లలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కడియం శ్రీహరి కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే ఈఎన్సీ రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ప్రస్తుతం జరుగుతున్న పంపింగ్, రిజర్వాయర్లలో ఉన్న నీటి లభ్యతను పరిశీలించి, వచ్చే రెండు నుంచి మూడు రోజుల్లో ప్రజా ప్రతినిధులతో సమావేశమై సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన సర్పంచ్ ఫక్రుద్దీన్"

**పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా బోధన ఉండాలి"**



సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు 04 (తెలుగుగళం) న్యూస్ : నియోజకవర్గ పరిధిలోని వేంసూరు గ్రామ సర్పంచ్ ఎం.డి. ఫకృద్దీన్ స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పోషకాహారం, నిర్వహణ విధానంపై ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధతో బోధన నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిపై గ్రామస్తులతో సమావేశమై రహదారుల అభివృద్ధి, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. గ్రామ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో: ఉప సర్పంచ్ ఈడా కొండలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మల్లెల్లి నరసింహాస్వామి, కాంగ్రెస్ నాయకులు కిన్నెర లాజర్, కిన్నెర రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# ఏటూరునాగారం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి


## -- మంత్రి సీతక్కకు సర్పంచ్ శ్రీలత వినతి

**పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి**

**రెండు ట్రాక్టర్లు, ముగ్గురు ఎంపిడబ్ల్యూ ల నియామకం, డ్రైనేజీ--తాగునీటి పనులకు నిధులు కోరిన ఏటూరునాగారం సర్పంచ్**





తెలుగు గళం ఏటూరునాగారం :

ములుగు జిల్లా ఏటూరు నాగారం మేజర్ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి, పారిశుద్ధ్య మెరుగుదల, తాగునీటి సౌకర్యాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఏటూరునాగారం గ్రామ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాకులమర్రి శ్రీలత మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రామంలో మౌలిక వసతులు, పారిశుద్ధ్య సేవలు, తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాలీలతో కూడిన రెండు కొత్త ట్రాక్టర్ల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న వనరులు సరిపోకపోవడంతో గ్రామ పరిశుభ్రతపై ప్రభావం పడుతోందని వివరించారు. అదేవిధంగా గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అత్యవసర సేవలను మెరుగుపర్చేందుకు అదనంగా ముగ్గురు మల్టీ పర్పస్ వర్కర్స్ నియామకానికి ప్రభుత్వ అనుమతి ఇవ్వాలని కోరారు. తగిన సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు సేవలందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణం, డ్రైనేజీల పూడికతీత, ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణం, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు నిరంతరం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని, అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతులను వెంటనే మంజూరు చేయాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని పెద్దచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్



మెట్‌పల్లి పట్టణం,తెలుగు గళం: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలో కురిసిన భారీ వర్షాలకు పెద్దచెరువు కోతకు గురికావడంతో ఆ చెరువును ఎమ్మెల్యే సంజయ్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పురపాలక అధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు నీటిపై మీకేమైనా అవగాహన ఉందా అంటూ అధికారులను ప్రశ్నించారు. చెరువు కట్ట తెగడంతో లక్షల రూపాయలు విలువ చేసే చేపలు బయటకు వెళ్లి మత్స్యకారులు నష్టపోయారని పేర్కొన్నారు. మత్స్యకారులకు పరిహారం అందించి ఆదుకోవాలని తెలిపారు. చెరువు కట్ట అభివృద్ధి పనులపై అసహనం వ్యక్తం చేశారు.

# స్టేషన్ ఘనపూర్ ఆసుపత్రి నిర్మాణం డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి

తెలుగు గళం న్యూస్
హైదరాబాద్, ఆగస్టు 4





ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు చేపడుతున్న వైద్య ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి పనులపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో హైదరాబాద్ సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు.సమావేశంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి, స్టేషన్ ఘనపూర్ 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, వైద్య సేవల విస్తరణ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, స్టేషన్ ఘనపూర్లో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి భవనాన్ని 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి, 2027 నూతన సంవత్సరంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.ఆసుపత్రి ప్రారంభించే నాటికే అవసరమైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలను కూడా సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల, చిల్పూర్ మండల కేంద్రం, రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామాల్లోని హెల్త్ సబ్ సెంటర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.స్టేషన్ ఘనపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ సేవలను వెంటనే ప్రారంభించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతుల నుంచి లక్షల్లో అక్రమ వసూళ్లు..

**విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్**




చిల్పూర్, ఆగస్టు 4 (తెలుగు గళం న్యూస్)

జనగామ జిల్లా చిల్పూర్ మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగి గడ్డం సిద్దయ్య రైతుల నుంచి కొత్త విద్యుత్ కనెక్షన్లు, మీటర్లు, డీడీలు, ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర పేర్లతో భారీగా డబ్బులు వసూలు చేశారని సీపీఎం చిల్పూర్ మండల కమిటీ ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం మండల కార్యదర్శి సాదం రమేష్ ప్రెస్ నోట్ విడుదల చేశారు.ఫిబ్రవరి 2026 నుంచి ప్రభుత్వం కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు కేవలం రూ.1,000 ప్రతి కిలోవాట్ మాత్రమే చెల్లించాలని జీవో జారీ చేసినప్పటికీ, శ్రీపతిపల్లి గ్రామంలోనే 13 మంది రైతుల నుంచి వివిధ పేర్లతో మొత్తం రూ.1,23,500 వసూలు చేశారని ఆయన ఆరోపించారు.లింగంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో కూడా ఇదే తరహాలో వసూళ్లు జరిగినట్లు సమాచారం ఉందన్నారు.డీడీలు, ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, పోల్ ఖర్చులు, ఇతర సాంకేతిక పనుల పేరుతో రైతుల నుంచి వేల రూపాయలు వసూలు చేశారని, ట్రాన్స్‌ఫార్మర్ హెచ్‌జీ ఫ్యూజ్ (ఎచ్‌జీ ఫ్యూజ్) కాలిపోయినా ఒక్కో రైతు నుంచి రూ.500 చొప్పున వసూలు చేస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. ఈ డబ్బులు ఏఈ, డీఈ స్థాయి అధికారుల వరకు వెళ్తాయని సంబంధిత ఉద్యోగి బహిరంగంగానే చెబుతున్నాడని, అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద ఎత్తున వసూళ్లు జరగడం సాధ్యమేనా అని రైతులు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై తక్షణ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది.మూడు రోజుల్లో బాధిత రైతులకు వసూలు చేసిన మొత్తం డబ్బును తిరిగి ఇప్పించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగి గడ్డం సిద్దయ్యను వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరింది.అలాగే ఈ వ్యవహారంలో ఏఈ, డీఈల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది.డిమాండ్లను ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోతే చిల్పూర్ ఏఈ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ హెచ్చరించారు.

# అడవులు మన భవిష్యత్తు -- చట్టాల అమలు రాజీలేని బాధ్యత!

### --- రచన: రవిబాబు పిట్టల, పర్యావరణవేత్త



అడవులు కేవలం అందమైన ప్రకృతి దృశ్యాలు మాత్రమే కాదు; వర్షపాతం, భూగర్భ జలాలు, గాలి నాణ్యత మరియు జీవవైవిధ్యాన్ని కాపాడే జీవనాధార వ్యవస్థలు. ముఖ్యంగా రిజర్వ్ ఫారెస్టులు అరుదైన వన్యప్రాణులు, మొక్కలు మరియు జలచరాలకు సురక్షిత ఆశ్రయాలు. రిజర్వ్ ఫారెస్టుల్లో జలవనరుల ప్రాముఖ్యత: అడవుల్లోని కుంటలు, వాగులు, చెరువులు అటవీ జీవవ్యవస్థకు గుండెకాయ లాంటివి. ఆహార గొలుసులో చేపలు మరియు ఇతర జలచరాలు అత్యంత కీలకం. అక్రమంగా చేపలు పట్టడం వల్ల వన్యప్రాణులకు, నీటిపక్షులకు తీవ్రమైన ఆహార కొరత ఏర్పడి జీవవైవిధ్యం దెబ్బతింటుంది. పైగా అక్రమంగా చేపలు పట్టేవారు వాడే కరెంట్, విష రసాయనాలు మరియు నాటు వలల వల్ల నీరు కలుషితమై, ఇతర జీవులు కూడా నాశనమవుతున్నాయి.

**చట్టపరమైన రక్షణ & రాజ్యాంగ బాధ్యత:** భారతదేశంలో అటవీ సంపద రక్షణకు బలమైన చట్టాలు ఉన్నాయి:

**వన్యప్రాణి (సంరక్షణ) చట్టం, 1972 & భారత అటవీ చట్టం, 1927:** అనుమతి లేకుండా రిజర్వ్ ఫారెస్టుల్లోకి ప్రవేశించడం, చేపలు పట్టడం, వేటాడటం లేదా ఆక్రమణలు చేయడం తీవ్రమైన నేరాలు.

**జీవవైవిధ్య చట్టం, 2002:** జీవవనరుల దుర్వినియోగాన్ని అరికడుతుంది.

**భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ (జి):** అడవులు, సరస్సులు, నదులు మరియు వన్యప్రాణులను కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యతగా పేర్కొంటోంది.

**గిరిజన హక్కులు vs పర్యావరణ పరిరక్షణ:** అడవులపై శతాబ్దాలుగా ఆధారపడిన గిరిజనుల హక్కులు అటవీ హక్కుల చట్టం, 2006 ప్రకారం రక్షించబడినప్పటికీ, అవి వారి కుటుంబ స్వయం సమృద్ధికి మాత్రమే పరిమితం. సాంప్రదాయ హక్కుల పేరుతో బయటి వ్యక్తులు లేదా దళారుల ప్రమేయంతో వాణిజ్య ప్రయోజనాల కోసం అడవులను, జలవనరులను దోచుకోవడం పూర్తిగా చట్టవిరుద్ధం.

**అటవీ అధికారులకు సమాజం అండగా నిలవాలి:** అక్రమ ఆక్రమణలను, చేపల వేటను అరికడుతున్న అటవీ అధికారుల చర్యలు పూర్తిగా సమర్థనీయం. అయితే, కొంతమంది స్వార్థపరులు లేదా రాజకీయ ప్రభావం ఉన్న వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం విధుల్లో ఉన్న అధికారులను బెదిరించడం, భౌతిక దాడులకు దిగడం తీవ్రమైన నేరం. అటవీ రక్షణలో నిష్పాక్షికంగా పనిచేస్తున్న అధికారులకు ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం మరియు పౌర సమాజం పూర్తి అండగా నిలవాలి.







**ఇప్పుడు మన బాధ్యత:** వాతావరణ మార్పులు మరియు గ్లోబల్ వార్మింగ్ తీవ్రమవుతున్న ఈ కాలంలో అటవీ సంపదను రక్షించుకోవడం అత్యంత ఆవశ్యకం. అడవులను కాపాడుకోవడం ద్వారానే మన భవిష్యత్ తరాల మనుగడ సురక్షితమవుతుంది.

అక్రమాలకు వ్యతిరేకంగా నిలుద్దాం!
అటవీ అధికారులకు మద్దతుగా నిలుద్దాం!
అటవీ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుదాం!

రచయిత: రవిబాబు పిట్టల, మాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, JNTUH & జె.ఎస్. ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ, తెలంగాణ

# విద్య, వైద్యం ఉచితంగా అందే వరకు పోరాటం ఆగదు: ఈగం శ్రీనివాస్



### -- విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చడంతోనే పేదరికం పెరుగుతోంది

### -- ప్రజల మద్దతుతోనే ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం

**తెలుగు గళం న్యూస్ జనగామ ఆగస్టు 04**

దేశంలో పేదరికం నిర్మూలనకు ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అత్యవసరమని సామాజిక ఉద్యమకారుడు ఈగం శ్రీనివాస్ అన్నారు. పేద ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు "కేజీ టూ పీజీ" ఉచిత విద్య, మెరుగైన వైద్య సేవలు అందిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. తమ ఉద్యమం ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, దేశంలోని పేద ప్రజలకు న్యాయం జరగాలనే లక్ష్యంతోనే ప్రారంభించామని తెలిపారు.ప్రస్తుతం దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని, లక్షల రూపాయలు ఖర్చు చేసి చదివినా ఉద్యోగంపై భరోసా లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రపంచంలోని అనేక దేశాలు నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుండగా, మన దేశంలో మాత్రం విద్యను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.వైద్య రంగంలోనూ సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన సౌకర్యాలు, వైద్య సేవలు లేకపోవడం, మరోవైపు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స ఖర్చులు భరించలేని స్థాయికి చేరుకోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.ప్రజల ప్రాథమిక హక్కులైన విద్య, వైద్యాన్ని ప్రభుత్వాలు సమర్థంగా అమలు చేయకపోతే సంక్షేమ పథకాలతో సమస్యలు పరిష్కారం కావని అన్నారు. సంక్షేమ పథకాల కంటే ప్రతి పేద విద్యార్థికి ఉచిత విద్య, ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తే ప్రజలు స్వయం సమృద్ధి సాధిస్తారని అభిప్రాయపడ్డారు.దేశంలోని మేధావులు, కార్మికులు, రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు ఈ ఉద్యమానికి మద్దతు తెలపాలని ఈగం శ్రీనివాస్ పిలుపునిచ్చారు.దేశంలోని ప్రతి పేద కుటుంబానికి ఉచిత విద్య, మెరుగైన ఉచిత వైద్యం అందే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని, ప్రజల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# క్షణాల వ్యవధిలో ప్రాణాలను కాపాడిన మడికొండ పోలీసులు

### పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన యువకుడు..

### సమయస్ఫూర్తితో స్పందించి మృత్యువు అంచుల నుంచి రక్షించిన పోలీసులు





**తెలుగు గళం న్యూస్ హనుమకొండ, ఆగస్టు 4**

జీవితం మీద విరక్తి చెందిన ఓ యువకుడు అందరూ చూస్తుండగానే తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన హృదయ విదారక ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకుంది.క్షణాల్లోనే విషాదంగా మారాల్సిన ఈ ఘటనను మడికొండ పోలీసుల సమయస్ఫూర్తి అడ్డుకుంది.అమ్మవారిపేట ఎక్స్‌రోడ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కరీమాబాద్‌కు చెందిన మెరుగు పవన్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. ఆ దృశ్యాన్ని గమనించిన పెట్రో కార్ సిబ్బంది సంపత్, గోవర్ధన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా పరుగెత్తుకుంటూ వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చి, అతని ప్రాణాలను కాపాడేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించారు.వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్ఐ రాజబాబు, ఏఎస్ఐ మహిపాల్ రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం అతనికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.కళ్లముందే ఓ ప్రాణం అగ్నికి ఆహుతి కావాల్సిన పరిస్థితిని పోలీసులు తమ అప్రమత్తత, ధైర్యసాహసాలతో అడ్డుకోవడం స్థానికులను కదిలించింది. వారి సమయోచిత చర్యలను ప్రజలు ప్రశంసిస్తూ, "పోలీసులు క్షణం ఆలస్యం చేసి ఉంటే మరో కుటుంబంలో విషాదం నెలకొనేది" అని అభిప్రాయపడ్డారు.

# చందానగర్‌లో దారుణం : లిఫ్ట్ ప్రమాదంలో మహిళ దుర్మరణం



**చందానగర్,తెలుగు గళం:** లిఫ్ట్ మరమ్మతుల సమయంలో నిర్వహణ లోపం, నిర్లక్ష్యం ఒక ప్రాణాన్ని బలితీసుకుంది. బంధువును పరామర్శించడానికి వచ్చి ప్రమాదవశాత్తు లిఫ్ట్ ప్రమాదంలో ఇరుక్కుని తీవ్రగాయాలపాలై ఓ మహిళ మృతి చెందిన విషాద సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలానికి చెందిన ధాడి శ్రీనివాస్ (46), భార్య అనసూయ (43)తో కలిసి నల్లగండ్ల లోని ఎస్సీ కాలనీలో నివాసముంటూ, అపర్ణ జెనిత్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. చందానగర్‌లోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, చాట్వాజ్ మెన్షన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న తన మేనమామ ధాడి గోవింద్ తలకు గాయం కావడంతో, ఆయనను పరామర్శించేందుకు శ్రీనివాస్ తన భార్య అనసూయతో కలిసి మంగళవారం ఉదయం 11:00 గంటల సమయంలో అక్కడికి వెళ్లాడు.అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరుకున్న అనంతరం శ్రీనివాస్ లిఫ్ట్ బటన్ నొక్కగా, తలుపులు తెరుచుకోవడంతో అతడు మొదట లోపలికి వెళ్లాడు. ఆ తర్వాత అనసూయ లిఫ్ట్‌లోకి ఎక్కుతుండగా---ఒక కాలు లోపల, మరో కాలు బయట ఉండగానే---తలుపులు పూర్తిగా మూసుకోకముందే లిఫ్ట్ అకస్మాత్తుగా పైకి కదిలింది. దీంతో అనసూయ లిఫ్ట్‌కు, ప్రవేశ ద్వారానికి మధ్య తీవ్రంగా నలిగిపోయి ఇరుక్కుపోయింది. నడుముతో పాటు శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. శ్రీనివాస్ కేకలు వేయడంతో అపార్ట్‌మెంట్ నివాసితులు, చుట్టుపక్కల వారు వెంటనే స్పందించి లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన అనసూయను బయటకు తీశారు. అనంతరం హుటాహుటిన చికిత్స నిమిత్తం చందానగర్‌లోని అర్చనా ఆసుపత్రికి తరలించగా, ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స లేదా తదుపరి విచారణ నిమిత్తం మృతదేహాన్ని నిజాంపేటలోని హోలిస్టిక్ హాస్పిటల్‌కు ఆమె కుమార్తె తరలించింది.ప్రమాదం జరిగిన సమయంలో లిఫ్ట్ మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని విచారణలో వెల్లడైంది.

# కానిస్టేబుల్ నియామకాల్లో 75% షెడ్యూల్ ఏరియా రిజర్వేషన్ అమలు చేయాలి

### ఆదివాసీల హక్కులను కాపాడాలని మంత్రి సీతక్కకు వినతిపత్రం

### 5వ షెడ్యూల్ ప్రాంత యువతకు అన్యాయం ఆపాలని తుడుందెబ్బ, ఏఎస్యూ డిమాండ్



**తెలుగు గళం తాడ్వాయి మేడారం:**

రాష్ట్ర పోలీసు శాఖలో కానిస్టేబుల్ నియామకాల్లో షెడ్యూల్ ఏరియా ఆదివాసీ అభ్యర్థులకు అమలు కావాల్సిన 75 శాతం స్థానిక రిజర్వేషన్ నిబంధనలను యథావిధిగా అమలు చేసి న్యాయం చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) కు తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. అరుణ్ కుమార్, ఏఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 10-05-2018న విడుదలైన తెలంగాణ స్టేట్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సర్వీస్ రూల్స్ గెజిట్ నోటిఫికేషన్‌లోని నిబంధనలు, జీవో ఎంఎస్ . నం ..30 (11-07-2019), అలాగే జీవో నం .109 (17-06-1988) ప్రకారం షెడ్యూల్ ప్రాంతాల్లోని ఉద్యోగాల్లో 75 శాతం స్థానిక షెడ్యూల్ ఏరియా అభ్యర్థులకు అవకాశం కల్పించాల్సిన నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని వివరించారు. అదేవిధంగా 2015, 2018, 2022 సంవత్సరాల్లో జరిగిన నియామకాలలో ఈ నిబంధనల ప్రకారం ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం జరిగిందని, అయితే ప్రస్తుతం పోలీసు నియామక ప్రక్రియలో సాధారణ నిబంధనల ఆధారంగా నోటిఫికేషన్ జారీ కావడం వల్ల 5వ షెడ్యూల్ ప్రాంత ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించి, సంబంధిత శాఖలతో చర్చించి 75 శాతం షెడ్యూల్ ఏరియా రిజర్వేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కను కోరినట్లు తెలిపారు. మంత్రి సీతక్క సమస్యను సానుకూలంగా పరిశీలించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. అరుణ్ కుమార్, ఏఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వటం సుభద్ర, ఏఎస్యూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధబోయిన కార్తీక్, గొంది రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


# నారా లోకేష్ రాజీనామా చేయాలి

### -- డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి



**రావులపాలెం (తెలుగు గళం)ఆగస్టు 4:** కేంద్రంలో విద్యాశాఖ మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లుగానే, ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులను మోసం చేసినందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు.కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం CRC ఫంక్షన్ హాల్‌లో విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన AP GEN-Z WAR టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అలాగే డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, విద్యార్థులు, యువత హక్కుల కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

# ఎయిడ్స్ నియంత్రణకు చర్యలు : కలెక్టర్




**నల్లగొండ (తెలుగు గళం):** హెచ్ ఐ వి ఎయిడ్స్ నివారణకు చికిత్స కన్నా వ్యాధి సోకకుండా చర్యలు తీసుకావాలని, అందుకే ఎయిడ్స్ పై జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ఎయిడ్స్ నివారణ, నియంత్రణ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ఈ నెల 12 నుండి 18 వరకు ప్రచారకార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూలు రూపొందించడం జరిగిందని, గ్రామాలలో కళాజాత బృందాల ద్వారా ప్రజలకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలని ,సూచించారు.. హెచ్ఐవి ఎయిడ్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో స్థానిక మున్సిపల్ కమిషనర్ల సహకారంతో అవగాహన శిబిరాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, మిర్యాలగూడ, దేవరకొండ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. హెచ్ ఐ వి సోకిన ట్రాన్సజెండర్ లకు ప్రభుత్వం తరపున అందించే సహాయం లో భాగంగా ఆధార్ కార్డు లేని ట్రాన్స్ జెండర్ లకు గుర్తింపు కార్డుతో పాటు, పెన్షన్, రేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 5176 హెచ్ఐవి ఎయిడ్స్ పాజిటివ్ కేసులు నమోదు కాగా వీరందరికీ రెగ్యులర్ చికిత్స అందించడం జరుగుతున్నదని తెలిపారు.. జిల్లాలో 2540 మంది వ్యాధి గ్రస్తులు ఆసరా పెన్షన్లు పొందుతున్నారని, 3062 దరఖాస్తులను పెన్షన్ల కోసం ప్రతిపాదించినట్లు వెల్లడించారు


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.